సాక్షి
వైఎస్ఆర్ జిల్లా
శనివారం । 26 । అక్టోబర్ । 2024



పెయ్య దూడల ఉత్పత్తి పెంచాలి

జిల్లాలో పెయ్య దూడల ఉత్పత్తి పెంపుదలకు పశువైద్యులు కృషి చేయాలని రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డాక్టర్ శ్రీనివాసరావు పేర్కొన్నారు. -10లో



నర్సింగ్ విద్యార్థుల ఆందోళన

జమ్మలమడుగు పట్టణం సీఎస్ఐ క్యాంబెల్ ఆసుపత్రి ఆవరణలోని నర్సింగ్ కాలేజీ విద్యార్థులు యాజమాన్యం అన్నం పెట్టడం లేదంటూ నిరసన వ్యక్తం చేశారు. -10లో

గరిష్టం/కనిష్టం
32.4/22.4

వాతావరణం

జిల్లాలో శుక్రవారం 22.4 - 32.4 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 1.3 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

-కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

దరఖాస్తు గడువు పొడిగింపు

కడప రూరల్: ఉచిత డీఎస్సీ శిక్షణ కోసం దరఖాస్తు గడువును ఈనెల 27వ తేది వరకు పొడిగించారని జిల్లా సాంఘిక సంక్షేమశాఖ ఉపసంచాలకులు కె.సరస్వతి ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులకు సంబంధించి జ్ఞాన భూమి వెబ్ పోర్టల్‌లో వివరాలు అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని అర్హులైన అభ్యర్థులు, శిక్షణా సంస్థల యాజమాన్యాలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

15న కోటి దీపోత్సవం



శివదర్శనానంద సరస్వతీ మాతాజీ

ప్రొద్దుటూరు: స్థానిక శ్రీకృష్ణ గీతాశ్రమంలో శివదర్శనానంద స్పిరిచ్యువల్ ట్రస్టు ఆధ్వర్యంలో కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని నవంబర్ 15న సాయంత్రం 5 గంటలకు కోటి దీపోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు శివదర్శనానంద సరస్వతీ మాతాజీ తెలిపారు. ఆమె శుక్రవారం మాట్లాడుతూ కోటి దీపోత్సవంలో పాల్గొని కోటి పుణ్యకర్మల ఫలితాన్ని పొందాలని సూచించారు.

జిల్లా ఆస్పత్రి పరిశీలన



రికార్డులను పరిశీలిస్తున్న కేంద్ర బృంద సభ్యులు డాక్టర్ నీరజ, సందీప్

ప్రొద్దుటూరు క్రైం: పట్టణంలోని స్థానిక జిల్లా ఆస్పత్రిలో కేంద్ర బృందం శుక్రవారం పర్యటించింది. ఢిల్లీ నుంచి వచ్చిన డాక్టర్ నీరజ, డాక్టర్ సందీప్‌లు ఆస్పత్రిలోని వివిధ విభాగాలను పరిశీలించారు. టీబీ ముక్తభారత్ కార్యక్రమంలో భాగంగా ప్రతి మూడు నెలలకు ఒక సారి జిల్లాలోని మెడికల్ కాలేజీ, ఒక వైద్యవిధాన పరిషత్ హాస్పిటల్, పీహెచ్‌సీలను తనిఖీ చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఆస్పత్రిలోని వసతులపై ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ ఈశ్వర్‌సురేంద్ర కేంద్ర బృందానికి వివరించారు.

నేటి నుంచి లోన్ మేళా

కడప కోటిరెడ్డిసర్కిల్: స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా 26,27వ (శని, ఆదివారం) తేదీల్లో కడప నగరంలోని నేక్‌నామ్ కళాక్షేత్రంలో నిర్వహించే ఎస్‌బీఐ హోమ్ లోన్ ఉత్సవ్, లోన్‌మేళాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆ బ్యాంకు రీజినల్ మేనేజర్ శ్రీవాణి కిషోర్ కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు వ్యక్తిగత రుణాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులకు, ఇతర ఉద్యోగులకు వ్యక్తిగత లోన్ ఇవ్వనున్నట్లు వివరించారు. అలాగే వాహన, గృహ రుణాలు, ఇంటి నిర్మాణానికి, స్థలం లేదా ఇల్లు కొనేందుకు సైతం రుణ మంజూరు జరుగుతుందన్నారు. అదేవిధంగా పెన్షనర్లకు పెన్షన్ రుణాలు, విదేశాలలో చదువుకోవాలనుకునే వారికి విద్యారుణాలు ఇస్తారన్నారు. స్వదేశంలో గుర్తింపు పొందిన కాలేజీలలో చదువుకొనేవారికి కూడా ఎటువంటి సెక్యూరిటీ లేదా గ్యారంటీ లేకుండా రూ.1.5 కోట్ల వరకు విద్యా రుణము మంజూరు చేయనున్నట్లు వెల్లడించారు. మహిళలకు వడ్డీలో 0.5 శాతం రాయి తీ తమ బ్యాంకు ప్రత్యేకత అన్నారు. ఈ మేళాలో కాయిన్ మేళా కూడా ఏర్పాటు చేస్తున్నామని, అవసరమైన వారు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

జిల్లాలో పశుగణన ప్రారంభం



కలెక్టర్ అదితిసింగ్ ఇంటి వద్ద పశుగణనను చేస్తున్న జిల్లా పశుసంవర్ధశాఖ అధికారులు

కడప అగ్రికల్చర్: జిల్లావ్యాప్తంగా శుక్రవారం ఉదయం నుంచి జాతీయ పశుగణన ప్రారంభమైంది. ముందుగా జిల్లా పశువైద్యాధికారి శారదమ్మ తన సర్వే సిబ్బందితో కలిసి కడపలోని జిల్లా ఇంచార్జి కలెక్టర్ ఆదితి సింగ్, కడప ఎమ్మెల్యే మాధవిరెడ్డి నివాసాలకు వెళ్లి 21వ పశుగణన సర్వేని ప్రారభించారు. ఈ సందర్భంగా జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ శారదమ్మ మాట్లాడుతూ ఈ పశుగణన సర్వే ప్రక్రియలో భాగంగా జిల్లా పశువైద్యాధికారులు, పశుగణన కోసం నియమించిన సిబ్బంది కలిసి 2025 ఫిబ్రవరి 28వ తేదీ వరకు జిల్లాలో పశుగణన నిర్వహిస్తారన్నారు. ఇందులో భాగంగా జిల్లాలో పశువులు, పెంపుడు జంతువులు, గొర్రెలు, మేకలు, ఆవులు, ఎద్దులు, కోళ్లు ఎన్ని ఉన్నాయనే విషయాన్ని ఇంటింటికీ వెళ్లి పక్కాగా వివరాలను సేకరిస్తారని తెలిపారు. గణన చేసే ప్రాంతంలోనే రైతు ఇంటి వద్దనే అన్నింటిని పరిశీలించి గణించి యాప్లో అప్లోడ్ చేస్తారన్నారు. ఆ వివరాలను సూపర్ వైజర్లు, ఆపై జిల్లా అధికారులు పర్యవేక్షిస్తారన్నారు. నోడల్ అధికారి ప్రమోద్‌కుమార్ రెడ్డి, డీడీ రంగ స్వామి, ఏడీ శ్రీధర్, లింగారెడ్డి పాల్గొన్నారు.

మా రూటే.. బైపాస్!

- వివాదాస్పదంగా మారుతున్న ఖాకీల నిర్ణయం
- దారి మళ్లింపుపై పెల్లుబుకుతున్న ప్రజా వ్యతిరేకత
- అదనపు భారంతో గమ్యాలకు ప్రయాణీకులు
- దారి మళ్లింపు కాదు... రోడ్డు విస్తరణ చేపట్టాలంటూ ప్రజల డిమాండ్



రాజంపేట బైపాస్ రహదారిలో నడుస్తున్న పల్లె వెలుగు బస్సు సర్వీసు

రాజంపేట: పార్లమెంటరీ నియోజకవర్గ కేంద్రమైన రాజంపేటలోకి బస్సుల దారిమళ్లింపు అంశం వివాదాస్పదంగా మారుతోంది. దారిమళ్లింపు అంశంను తెరపైకి తీసుకొచ్చిన పోలీసుశాఖ నిర్ణయం ఇప్పుడు వివాదానికి దారితీస్తోంది. ఈ విషయంపై అధికారులు అవలంబిస్తున్న తీరుపై ప్రజా వ్యతిరేకత పెల్లుబుకుతోంది. ఏ ప్రయాణీకుడిని కదిలించినా 'బస్సులు బైపాస్‌లోకి వెళితే.. ఇక బస్సులు ఎందుకు ఎక్కడం, నేరుగా ఆటోలు ఎక్కితే పోలా' అని పెదవి విరుస్తున్నారు. ఎక్స్‌ప్రెస్, గ్రామీణ బస్సులు బైపాస్‌లో నుంచి రాకపోకలు కొనసాగించడానికి ట్రాఫిక్‌ను కట్టడి చేయలేక, చివరికి ఆర్టీసీ బస్సులను దారి మళ్లించి ప్రతాపం చూపుతున్నారని పోలీసుల తీరుపై ప్రయాణీకులు పెదవి విరుస్తున్నారు. పోలీసుల తీరుతో అదనపు భారంతో గమ్యాలకు చేరుకుంటున్నామని... మా ఇబ్బందులు పట్టించుకునేవారు కరువయ్యారని ప్రజలు వాపోతున్నారన్నారు.

ముఖ్యమైన సమయాల్లో సరే..

పట్టణంలో ర్యాలీలు, ఉత్సవాలు ఆ సమయంలో కొంత సేపు దారిమళ్లిస్తే ట్రాఫిక్ అంతరాయం ఉండదని, అది ముఖ్యమైన సమయాల్లో సరే కానీ, నిత్యం అలాగే అంటే కష్టతరమని ప్రయాణీకులు మొరపెట్టుకుంటున్నారు. ఏకంగా కడప నుంచి వచ్చే బస్సులు పట్టణంలోకి రాకుండా నేరుగా పాతబస్టాండు చేరుకొంటే, పట్టణంలో దిగాల్సిన వారి పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తున్నారు. రాత్రివేళలో అంధకారంలో ఉండే బైపాస్‌లో బస్సులు దిగే మహిళా ప్రయాణీకులకు రక్షణ ఉంటుందా అని నిలదీస్తున్నారు.

విస్తరణతోనే ట్రాఫిక్ సమస్య శాశ్విత పరిష్కారం..



రాజంపేట పట్టణ ప్రధాన రహదారిలో పాత బస్టాండు నుంచి మన్నూరు వరకు విస్తరణ జరిపి ముందుకొచ్చిన కట్టడాలకు మార్కింగ్ కూడా ఇచ్చారు. మన్నూరు నుంచి పోస్టాఫీసు వరకు విస్తరణ చేసి సిమెంటు రోడ్డు వేశారు. అక్కడి నుంచి సిమెంటు రోడ్డు వేయడానికి కూటమి ప్రభుత్వం వెనుకాడుతోంది. విస్తరణ చేస్తే మిగిలిన రోడ్డు వేయగలిగిన పరిస్థితులు నెలకొన్నాయి. ఫలితంగా ట్రాఫిక్ సమస్యకు శాశ్విత పరిస్కారం లభిస్తుంది. దారిమళ్లింపు వద్దు..విస్తరణ ముద్దు అని ప్రయాణీకులు హితువు పలుకుతున్నారు.

ప్రయాణికులకు శాపంగా..



రాజంపేట బైపాస్‌లో ఆర్టీసీ బస్సులు నడపడం ప్రయాణికులకు శాపంగా మారింది. ఆర్టీసీలో చార్జీలు పెట్టుకొని ప్రయాణిస్తే, మళ్లీ అదనంగా ఆటోలో వెళ్లాల్సి వస్తోందని.. దీంతో అదనపు భారం పడుతోందని ప్రయాణీకులు వాపోతున్నారు. గతంలో కూడా అధికారులు బస్సులు దారిమళ్లించి చేతులు కాల్చుకున్నారు. ఒకొక్కసారి ఒకొక్క పోలీసు అధికారులు తమకు నచ్చిన విధంగా తీసుకునే నిర్ణయాలు ప్రయాణీకులకు కష్టాలు తెచ్చిపెడుతున్నాయి.

ఆర్టీసీ డీఎం ఏమంటున్నారంటే..

రాజంపేట బైపాస్‌లో బస్సులు నడపమని పోలీసుశాఖ ఆదేశించిందని , ఆమేరకు బస్సులను బైపాస్‌లో నడిపిస్తున్నామని ఆర్టీసీ డిపో మేనేజరు రమణయ్య స్పష్టం చేశారు. ఇదే విషయాన్ని తమ ఉన్నతాధికారులకు కూడా తెలియచేశామన్నారు.

బైపాస్‌లో బస్సుల రాకతో ఇబ్బందులు



బైపాస్‌లో బస్సుల రాకతో ఇబ్బందులు పడుతున్నాము. ప్రయాణికులు తికమకపడుతున్నారు. దూరప్రాంత సర్వీసులు బైపాస్‌లో వెళుతుంటాయి. ఇప్పు డు ఎక్స్‌ప్రెస్, పల్లె వెలుగులు కూడా బైపాస్‌లో వెళ్లడం ప్రయాణీకులపై అదనపుభారం పడుతుంది. బైపాస్‌లో ఆటోలు కూడా ఉండవు. మహిళలు, పిల్లలు, వృద్ధులకు ఇబ్బందులు తప్పడం లేదు.

- బాలాజీ, చిట్వేలి

అదనపు ఖర్చు



రాజంపేట బైపాస్ రహదారిలో బస్సులు నడపడంతో ఇబ్బందులు పడుతున్నాం. బైపాస్‌లో దిగితే ఆటోలు ఉండవు. ఒక వేళ ఉన్నా ఎక్కువ డబ్బు అడుగుతారు. పట్టణంలోకి నడుచుకుంటూ వెళ్లాలి. పట్టణ ప్రధాన రహదారి మన్నూరు నుంచి పాతబస్టాండు వరకు చాలా మంది ఇది వరకు బస్సులో దిగేవారు. ఇప్పటికైనా ప్రయాణీకుల కష్టాలపై అధికారులు పునరాలోచించాలి.

- జనయ్య, నందలూరు

ఆర్టీసీని ప్రమాద రహిత సంస్థగా మార్చాలి



మాట్లాడుతున్న జిల్లా ప్రజా రవాణాధికారి పొలిమేర గోపాల్‌రెడ్డి

కడప కోటిరెడ్డిసర్కిల్: ఏపీఎస్ ఆర్టీసీ సంస్థను ప్రమాద రహిత రవాణా సంస్థగా మార్చేందుకు డ్రైవర్లు కృషి చేయాలని జిల్లా ప్రజా రవాణాధికారి పొలిమేర గోపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక ఆర్టీసీ కార్యాలయ సమావేశ మందిరంలో తరుచూ ప్రమాదాలు చేస్తున్న హైర్ బస్సుల డ్రైవర్లకు శిక్షణ, కౌన్సెలింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ తొలినుంచి ఆర్టీసీకి ప్రమాద రహిత సంస్థగా గుర్తింపు ఉందన్నారు. అలాంటి గుర్తింపును కాపాడేందుకు డ్రైవర్లు కృషి చేయాలన్నారు. బస్సును నడిపే సమయంలో నిత్యం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డ్రైవర్లు ప్రయాణికులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, అధిక కేఎంపీఎల్ సాధించి సంస్థ పురోభివృద్ధికి తోడ్పడాలన్నారు. అనంతరం ఇతర అధికారులు డ్రైవర్లకు ప్రమాద రహిత డ్రైవింగ్‌పై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, వివిధ డిపోలకు చెందిన డ్రైవర్లు పాల్గొన్నారు.

రేపు రాయలసీమ జానపద కళావైభవం సదస్సు

ప్రొద్దుటూరు/కడప కల్చరల్: కడప నగరంలోని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో ఆదివారం ఉదయం 10 గంటలకు రాయలసీమ జానపద కళావైభవం సదస్సు నిర్వహించనున్నట్లు వక్త డాక్టర్ మూలె రామమునిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. నెలనెల సీమ సాహిత్యం ద్వారా ప్రస్తుతం 137వ సదస్సు నిర్వహిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య జి.పార్వతి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ప్రీమియం రైతులే చెల్లించాలి

- పాత బీమా విధానం అమలు
- జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ అదితిసింగ్

కడప అగ్రికల్చర్: జిల్లాలో పంటల బీమా పథకం రబీ 2024-25, అలాగే 2025-26 ఖరీఫ్, రబీ సీజన్‌లకు 2019 ముందు నాటి బీమా విధానమే అమలవుతుందని ఇన్‌చార్జి కలెక్టర్ అదితిసింగ్ తెలిపారు. ఇందులో భాగంగా ప్రధానమంత్రి ఫసల్ బీమా(పీఎంఎఫ్‌బీవై) సవరించిన వాతావరణ ఆధారిత బీమా పథకాలలో పంటల వారీ నిర్ణయించిన ప్రీమియంను రైతులే చెల్లించాల్సిన ఉంటుందని వివరించారు. ఈ క్రమంలో ప్రభుత్వం పంటల భీమా పథకం అమలు చేయుటకుగాను బీమా కంపెనీలు జిల్లావారిగా కేటాయించబడిందని తెలిపారు. ఇందులో వైఎస్సార్‌కడప జిల్లాకు ప్రధానమంత్రి ఫసల్ బీమా రబీ 2024-25కు ఫ్యూచర్ జనరల్ ఇన్సూరెన్స్ , వాతావరణ ఆధారిత బీమాకుగాను ఇఫ్‌కో టోకియోను నియమించినట్లు వెల్లడించారు. ప్రీమియం పంట రుణగ్రహీతలు, రైతులు నేరుగా బ్యాంకు ద్వారా చెల్లించాలని తెలిపారు. రబీలో బ్యాంకు ద్వారా పంట రుణాలను పొందిన రైతులు (సిఎస్‌సి) సీఎస్సీ కామన్ సర్వీస్ సెంటర్ ద్వారా నేరుగా ప్రీమియం చెల్లింపు జరపాలని ఇన్‌చార్జి కలెక్టర్ సూచించారు.

రబీ 2024-25, ఖరీఫ్, రబీ 2025-26 సంవత్సరాలకు సంబంధించి రైతులు చెల్లించాల్సిన ప్రీమియం వివరాలు ఇలా...

పంట	ఎకరాకు చెల్లించాల్సింది (రూపాయల్లో)	హెక్టారుకు చెల్లించాల్సింది (రూపాయల్లో)
వరి	638	1575
శనగ	486	1200
వేరుశనగ	486	1200
జొన్న	319	787.5
పెసలు	273	675
మినుములు	288	712.5
నువ్వులు	182	450
సన్‌ప్లవర్	304	750

నేడు ఓపెన్ హౌస్

కడప కోటిరెడ్డిసర్కిల్: పోలీసు అమర వీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం పోలీసు పెరేడ్ మైదానంలో ఓపెన్ హౌస్‌ను ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ప్రారంభించనున్నారు. విద్యార్థులకు పోలీసులు వినియోగించే ఆయుధాలు, ఇతర సాంకేతిక పరికరాలను వివరించనున్నారు.

సామాన్యుడికి న్యాయం జరగాలి

- పోలీసు అధికారుల సమీక్షలో ఎస్పీ హర్షవర్ధన్‌రాజు



మాట్లాడుతున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు



సమావేశంలో పాల్గొన్న సీఐలు

కడప కోటిరెడ్డిసర్కిల్: పోలీస్ స్టేషన్‌కు వచ్చే సామాన్యుల ఫిర్యాదులపై తక్షణం స్పందించి వారికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు పోలీస్ అధికారులను ఆదేశించారు. శనివారం క్యాంప్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో పోలీస్ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఎస్పీ మాట్లాడారు. గంజాయి, మెడికల్ షాప్‌లలో అక్రమంగా విక్రయించే మత్తు కలిగించే మాత్రల విక్రయాలపై నిఘా ఉంచి దాడులు నిర్వహించాలని ఆదేశించారు. అసాంఘిక కార్యకలాపాల నిరోధానికి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన డ్రోన్ల ద్వారా నిఘా ఉంచి దాడులు ఉధృతం చేయాలని ఆదేశించారు. సమర్థవంతంగా ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు డ్రోన్లను వినియోగించాలన్నారు. రౌడీ షీటర్లు, సస్పెక్ట్ షీట్లు ఉన్న వారి కదలికలపై నిఘా ఉంచాలన్నారు. పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలలో పోలీసుల విధులు, దర్యాప్తు విధానం, తదితర అంశాలపై వారికి అవగాహన కల్పించాలని సూచించారు.

- సమావేశంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) కె.ప్రకాష్ బాబు, కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు, మైదుకూరు డీఎస్పీ రాజేంద్ర ప్రసాద్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ వెంకట కుమార్,సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ భాస్కర్ రెడ్డి, కడప వన్‌టౌన్, చిన్నచౌకు, తాలూకా, చెన్నూరు, సీకే దిన్నె సీఐలు రామకృష్ణ, తేజోమూర్తి, వెంకటేశ్వర్లు, పురుషోత్తంరాజు, శివశంకర్ నాయక్‌లు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

దీపావళి పండుగ నేపథ్యంలో ప్రతి ఒక్కరూ నిబంధనల మేరకు నడుచుకోవాలని ఎస్పీ హర్షవర్ధన్‌రాజు సూచించారు. అనుమతులు లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా, అక్రమంగా టపాసులు నిల్వ ఉంచినా, విక్రయించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. శుక్రవారం ఆయన మాట్లాడారు. బాణసంచా విక్రయదారులు చట్టం సూచించిన నిబంధనలు, జాగ్రత్తలు పాటించాలన్నారు. దీపావళి పర్వదినాన టపాసులు కాల్చేటప్పుడు ప్రజలు కూడా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జిల్లాలో టపాసులు ఎక్కడైనా అక్రమంగా విక్రయిస్తున్నా, నిల్వ ఉంచినా డయల్ 100కుగానీ, స్థానిక పోలీసు స్టేషన్‌లోగాని సమాచారం అందించాలన్నారు.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు

- జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ అదితిసింగ్
- ఘనంగా అంధుల పాఠశాల వజ్రోత్సవ వేడుకలు



మాట్లాడుతున్న ఇన్‌చార్జి కలెక్టర్ అదితిసింగ్





హాజరైన విద్యార్థులు, ఉపాధ్యాయులు, లూయీ బ్రెయిలీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి, నగర మేయర్ సురేష్‌బాబు తదితరులు

కడప ఎడ్యుకేషన్: అంధులమనే ఆలోచన లేకుండా బాగా చదువుకుని ఉన్నతస్థాయికి చేరుకుని నలుగురికి సేవలందించే స్థితికి చేరుకోవాలని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ అదితిసింగ్ పేర్కొన్నారు. కడప శంకరాపురంలో అంధుల పాఠశాల ఏర్పాటు చేసి 75 ఏళ్ల పూర్తయిన సందర్భంగా శుక్రవారం పాఠశాల ఇన్‌చార్జు హెచ్‌ఎం వేపరాల ఎబినేజర్ ఆధ్వర్యంలో వజ్రోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేడుకలకు ఇన్‌చార్జ్ కలెక్టర్‌తో పాటు మేయర్ సురేష్‌బాబు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ యంవీ రామచంద్రారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు జ్యోతి ప్రజ్వలన చేసి అంధుల ఆరాధ్యదైవం లూయిబ్రెల్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జు కలెక్టర్ అదితిసింగ్ మాట్లాడుతూ అంధులు లూయి బ్రెయిలీని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. పాఠశాలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు తమ వంతు కృషి చేస్తానన్నారు. పిల్లలకు హ్యాండ్ రైట్ ఫోన్స్, లాబ్స్‌ను అందించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

విద్యావేత్తలుగా ఎదగాలి: నగర మేయర్ సురేష్‌బాబు

బాగా చదువుకుని మంచి విద్యావేత్తలుగా ఎదగాలని నగర మేయర్ సురేష్‌బాబు పేర్కొన్నారు. ఇటీవల అంధురాలు ఒకామే జిల్లా కలెక్టర్ కూడా అయ్యారని అలాంటి వారిని మీరంతా స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. తాను చిన్నచౌక్ సర్పంచ్‌గా ఉన్నప్పటి నుంచే అంధుల పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తూ వస్తున్నానన్నారు. నేడు కడప కార్పొరేషన్‌లో 10 మంది అంధులకు ఉద్యోగాలను కల్పించి వారికి ఉపాధి కల్పిస్తున్నామన్నారు. చాలా మంది ఇక్కడే చదివి ఇక్కడే ఉపాధ్యాయులై సేవలందించడం అభినందనీయం అన్నారు.

అభివృద్ధికి కృషి చేస్తాం: ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి

అంధుల పాఠశాల అభివృద్ధికి ఎమ్మెల్సీగా తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి అన్నారు. అంధుల పాఠశాలకు జూనియర్ కళాశాల మంజూరు, అంధుల కోసం ప్రత్యేక శిక్షణ కేంద్ర ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. అలాగే బ్రెయిలీ పాఠ్యపుస్తకాలు సకాలంలో విద్యార్థులకు అందించేందుకు, అలాగే నూతన భవనాల మంజూరు విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి మంజూరు చేయించేందుకు శాయాశక్తుల కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పాఠశాల ఇన్‌చార్జు హెచ్‌ఎం వేపరాల ఎబినైజర్ మాట్లాడుతూ అంధుల పాఠశాలలో ఇప్పటి వరకు 10వ తరగతి వరకే బోధన ఉందని.. ఇంటర్మీడియట్ కళాశాలను ప్రభుత్వం మంజూరు చేస్తే అంధులు ఉన్నత విద్యను కొనసాగించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. అలాగే అంధులు తమ కాళ్లపైన వాళ్లు నిలబడాలంటే డీఎడ్ ఒకేషనల్ కాలేజీని కూడా ఏర్పాటు చేయాలని కోరారు. మాజీ హెచ్‌ఎం శంకరయ్య, ప్రాథమిక పాఠశాల హెడ్ టీచర్ రమణ, అంధుల పాఠశాల ఉపాధ్యాయులతోపాటు అంధుల సమాఖ్య నాయకులు, పాఠశాల పూర్వపు అంధ విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రొటోకాల్ ఉల్లంఘన

కడప ఎడ్యుకేషన్: కడప అంధుల ఉన్నత పాఠశాల వజ్రోత్సవ వేడుకల వేళ పాఠశాల ఆవరణలో 26వ తేదీన ఆవిష్కరించునున్న శిలాఫలకంలో ప్రొటోకాల్ ఉల్లంఘన జరిగింది. ప్రారంభోత్సవ శిలాఫలకంలో మొదటి పేరుగా మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, కడప ఎమ్మెల్యే మాధవిరెడ్డితో పాటు తదితరుల పేర్లను శిలాఫలకంలో లిఖించారు. ఇందులో నగర ప్రథమ పౌరుడు, నగర మేయర్ సురేష్ బాబు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి పేర్లు లేకపోవడతో అక్కడకు వచ్చిన కొందరిలో చర్చ జరిగింది. 'ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా ప్రొటోకాల్ ఉల్లంఘన జరగడం సరికాదని పలువురు విమర్శలు చేశారు. ఈ ప్రొటోకాల్ విషయంలో ఉన్నతాధికారులు స్పందించి వారికిచ్చే గౌరవాన్ని కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



విభజన హామీల సాధన కోసం పోరు



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జి.ఈశ్వరయ్య

కడప వైఎస్ఆర్ సర్కిల్ : రాష్ట్ర విభజన హామీల సాధన కోసం కేంద్ర ప్రభుత్వంపై సమరశీల పోరాటాలకు సమాయత్తం కావాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి. ఈశ్వరయ్య తెలిపారు. శుక్రవారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో జిల్లా సమితి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్ర విభజన సందర్భంగా నాటి యూపీఏ ప్రభుత్వం విభజన చట్టంలో పొందుపరిచిన హామీలను.. తర్వాత అధికారంలోకి వచ్చిన ఎన్డీఏ ప్రభుత్వం నెరవేర్చలేదన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, రాయలసీమ ఉత్తరాంధ్రకు ప్రత్యేక ప్యాకేజీ, పోలవరం పూర్తి, రాష్ట్ర రాజధాని నిర్మాణం, కడపలో ఉక్కు ఫ్యాక్టరీ, విద్య వైద్య పరిశోధన కేంద్రాల ఏర్పాటు తదితర హామీల్లో ఒక్కటీ నెరవేర్చలేకపోయారన్నారు. కేంద్రాన్ని నిలదీయాల్సిన రాష్ట్ర పాలక ప్రభుత్వాలు పల్లెత్తు మాట మాట్లాడలేకపోతున్నాయని విమర్శించారు. ప్రజా ప్రయోజనాల కంటే వ్యక్తిగత ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇవ్వడం వల్ల అభివృద్ధి కుంటుపడిందన్నారు. ఈ నేపథ్యంలో పాలక ప్రభుత్వాల తీరును నిరసిస్తూ.. తమ సమస్యల పరిష్కారం కోసం పోరాటానికి సిద్ధం కావాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు పి.దుర్గ భవాని, జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, జిల్లా కార్యవర్గ సభ్యులు బి.రామయ్య, ఎస్.వెంకటశివ, ఎంవీ సుబ్బారెడ్డి, పి.చంద్రశేఖర్, వి.వీరశేఖర్, ఎస్.విజయలక్ష్మి, గుంటి వేణుగోపాల్, కేసీ బాదుల్లా తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య



వెంకటేష్ (ఫైల్)

రైల్వేకోడూరు అర్బన్ : మండలంలోని కేబుదుగుంటపల్లి దళితవాడకు చెందిన ఎట్టి వెంకటేష్ (24) శుక్రవారం ఉదయం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కడుపు నొప్పి తాళలేక ఆయన ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రైల్వేకోడూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

డెయిరీ నిర్వహణలో దోచుకున్నారు!

- డీజిల్, రిపేర్ల పేరుతో రూ.5 లక్షలు స్వాహా
- బిల్లులు, లెక్కలు లేవని ఆడిట్‌లో తేల్చిన అధికారులు
- ఎఫ్‌పీఓ నిర్మాణం నిధుల లెక్కలపైనా అభ్యంతరం



బి.కొత్తకోట మండల సమాఖ్య కార్యాలయం

బి.కొత్తకోట : మండలంలోని బి.కొత్తకోట, కోటావూరుల్లో పాల డెయిరీల (బీఎంసీయూ) నిర్వహణ పేరుతో నిధులు స్వాహా చేసినట్టు వెలుగులోకి వచ్చింది. 2023–24 ఆర్థిక సంవత్సర ఆడిట్ నివేదిక ఆధారంగా.. రూ.5 లక్షలకు పైగా స్వాహా చేశారని తేలింది. బి.కొత్తకోట నగర పంచాయతీ కార్యాలయ ఆవరణలోని భవనంలో బీఎంసీయూ, కోటావూరు గ్రామం కాండ్లమడుగులోని బీఎంసీయూ (వీటిని మరో చోటికి తరలించారు)లు మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో నడుస్తున్నాయి. వీటి నిర్వహణ, ఆర్థిక పరిస్థితుల లాభనష్టాలు, ఆదాయ, వ్యయాలపై గత ఆర్థిక సంవత్సరానికి అధికారులు ఆడిట్ చేశారు. బి.కొత్తకోట బీఎంసీయూలో రిపేర్లకు రూ.1,90,095, డీజిల్‌కు రూ.1,16,100, కోటావూరు బీఎంసీయూలో రిపేర్లకు రూ.1,95,792, డీజిల్‌కు రూ.89,200 ఖర్చు చేసినట్టు ఆడిట్ అధికారుల దృష్టికి తెచ్చారు. ఈ మొత్తం రూ.5,91,187 నిధుల్లో రూ.5 లక్షల వరకు స్వాహా చేశారని భావిస్తున్నారు. రిపేర్లు చేయించివుంటే వాటికి సంబంధించిన బిల్లులు ఉండాలి. డీజిల్ వాడినట్లయితే ప్రతి పెట్రోలు బంకులో బిల్లులు ఇస్తారు. అయినా బిల్లులు లేవు. వీటి పేరుతో చేసిన ఖర్చులపై ఆడిట్ అధికారులు ఆడిగిన మేరకు.. నిర్వహణ బాధ్యత చూస్తున్న అధికారులు వివరాలు ఇవ్వలేదు. ముఖ్యంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం అన్నది దాదాపుగా లేదు. భారీ వర్షాలు, లైన్ల సమస్య ఉన్నప్పుడు మినహా విద్యుత్ సరఫరా కట్ లేదు. ఒకవేళ సరఫరా కట్ అయినా బీఎంసీయూలకు జనరేటర్ కోసం డీజిల్ వినియోగించిన తేదీల్లో విద్యుత్ సరఫరా ఉందా లేదా అన్న వివరాలు సబ్‌స్టేషన్లలో అందుబాటులో ఉంటాయి. ఎంత సమయం పవర్ కట్ అయ్యింది, ఆ సమయానికి ఎంత డీజిల్ వినియోగం ఉండొచ్చు అనే లెక్కలు వేస్తే.. ఏ మేరకు స్వాహా చేశారో ఇంకా స్పష్టంగా తేలుతుంది. ఇదే తరహాలో బీఎంసీయూల్లో రిపేర్ల వ్యవహారం సాగి ఉండవచ్చన్న అనుమానం వ్యక్తం అవుతోంది. నిర్వహణ లెక్కల్లో ఆదాయం పెరగాల్సి ఉండగా అందుకు విరుద్ధంగా నష్టాలు చూపించారు. డీజిల్, రిపేర్ల పేరుతో నిధులు చూపడం వల్లే ఇలా జరిగినట్టు తెలుస్తోంది. ఆడిట్‌లో వెలుగు చూసిన ఈ నిధుల స్వాహాపై ఉన్నతాధికారులు నివేదికపై చర్యలు చేపట్టలేదు. కాగా బి.కొత్తకోట ఎఫ్‌పీఓ గోదాము నిర్మాణం విషయంలో మంజూరు చేసిన నిధులపై వివాదం నెలకొంది. లక్షల్లో చెల్లించిన నిధుల వినియోగం నిబంధనల మేరకు జరిగిందా లేదా అన్నదానిపై అనుమానాలున్నాయి. ఈ నిధులపై జిల్లా అధికారులు ఆరా తీసి అగ్రహం వ్యక్తం చేసి.. లెక్కలు చెప్పాలని గత ఏపీఎంను ఆదేశించినట్టు తెలిసింది.

లెక్కలు సరిగా వేయలేదు

బీఎంసీయూల్లో నిధుల స్వాహా ఆడిట్ నివేదికపై గత ఏపీఎం మురళీ శుక్రవారం వివరణ ఇచ్చారు. ఆడిట్ అభ్యంతరాల గురించి ప్రస్తావించగా నిధుల వినియోగంపై అకౌంటెంట్ వివరాలు సక్రమంగా నమోదు చేయకపోవడం వల్లే ఈ సమస్య వచ్చిందని చెప్పారు. నిర్వహణలో నిధుల స్వాహా జరగలేదని చెప్పారు.

రేపు ప్రైవేటు పాఠశాలల విద్యా సదస్సు

కడప ఎడ్యుకేషన్ : కడపలోని ఉమేష్‌చంద్ర కల్యాణ మండపంలో ఆదివారం ఉదయం 9.30 గంటలకు అన్ ఎయిడెడ్ పాఠశాలల సమస్యలపై విద్యా సదస్సు నిర్వహిస్తున్నట్లు ఏపీ అన్ ఎయిడెడ్ స్కూల్స్ మ్యానేజ్‌మెంట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గువ్వల శ్రీనివాసులరెడ్డి తెలిపారు. ఈ సదస్సులో సమస్యలపై చర్చించి ప్రజా ప్రతినిధులకు, అధికారులకు నివేదికలను సమర్పించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కావున ఉమ్మడి జిల్లాలోని అన్ని ప్రైవేటు పాఠశాల కరస్పాండెంట్లు హాజరు కావాలని కోరారు.

11లోపు పది పరీక్ష ఫీజు చెల్లించాలి

కడప ఎడ్యుకేషన్ : జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల ప్రధానోపాధ్యాయులందరూ పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు–2025కు సంబంధించిన పరీక్ష ఫీజు రూ.125 రెగ్యులర్ విద్యార్థులు అక్టోబర్ 28వ తేదీ నుంచి నవంబర్ 11 లోపు చెల్లించాలని ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ వెంకటేసు తెలిపారు. 3 సబ్జెక్టుల కంటే ఎక్కువ ఉన్న వారు రూ.125 రుసుం చెల్లించాలని ఆయన పేర్కొన్నారు. ఒకేషనల్ విద్యార్థులు రూ.60 అదనపు రుసుంతో చెల్లించాలని వివరించారు.

విజయవాడ వరద బాధితులకు విరాళం

ప్రొద్దుటూరు : స్థానిక వైఎంఆర్ కాలనీలోని శ్రీఅరబిందో ఇంటిగ్రల్ స్కూల్ యాజమాన్యం విజయవాడ వరద బాధితుల సహాయ నిధికి రూ.5,55,555 చెక్కును శుక్రవారం ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డికి అందించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రెసిడెంట్ వంకదార వీరభద్రయ్య, కరస్పాండెంట్ కాశీప్రసాద్‌రెడ్డి, విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు మల్లికార్జునరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గంజాయి నిర్మూలన కోసం తనిఖీలు

కడప కోటిరెడ్డిసర్కిల్ : గంజాయి నిర్మూలనకు జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు నగరంలోని కొరియర్ కార్యాలయాలు, గోడౌన్‌లలో డిస్ట్రిక్ట్ నార్కోటిక్ కంట్రోల్ సెల్ (డీఎన్‌సీసీ) ఆధ్వర్యంలో శనివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. జిల్లాలో గంజాయిని పూర్తిగా కట్టడి చేసే క్రమంలో.. వివిధ ప్రాంతాల నుంచి జిల్లాకు రవాణా జరగకుండా జిల్లా ఎస్పీ ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా ఈ తనిఖీలు నిర్వహించారు. గంజాయి రవాణాకు పాల్పడినా, సహకరించినా కఠిన చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు. పార్సిళ్లలో ఎక్కడైనా గంజాయి ఆనవాళ్లను గుర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. తనిఖీల్లో డీఎన్‌సీసీ అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నైపుణ్యం పెంపుతో ఉద్యోగావకాశాలు పుష్కలం



మాట్లాడుతున్న బసిరెడ్డి రాజేశ్వరరెడ్డి

ప్రొద్దుటూరు కల్చరల్ : విద్యార్థులు నైపుణ్యం పెంచుకుంటే ఉద్యోగావకాశాలు పుష్కలంగా ఉంటాయని వక్తలు తెలిపారు. స్థానిక సాయిరాజేశ్వరి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం ఉతోపియా 2కే 24 జాతీయ మేనేజ్‌మెంట్ ఫెస్ట్‌ను ఎంబీఏ విద్యార్థులకు నిర్వహించారు. ఈ సందర్భంగా వైవీయూ బిజినెస్ మేనేజ్‌మెంట్ డిపార్ట్‌మెంట్ అసోసియేట్ ప్రొఫెసర్ సరిత మాట్లాడుతూ ఇలాంటి ఫెస్ట్‌లు విద్యార్థులలో విజ్ఞానాన్ని, నైపుణ్యాన్ని పెంపొందిస్తాయన్నారు. కళాశాల చైర్మన్ బసిరెడ్డి రాజేశ్వరరెడ్డి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి అధ్యాపకులు చెప్పే అంశాలను శ్రద్ధగా విని మేధస్సును పెంచుకోవాలన్నారు. ఫెస్ట్‌లో పలు కళాశాలలకు చెందిన 110 మంది విద్యార్థులు పాల్గొన్నారు. లీడర్‌షిప్‌లీగ్, హెచ్ఆర్‌గేమ్, మార్కెటింగ్ మైండ్స్, బిజినెస్ క్విజ్ అంశాలపై పోటీ నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రెసిడెంట్ వీరకుమార్‌రెడ్డి, కరస్పాండెంట్ వీరకళ్యాణ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ పాండురంగన్ రవి, వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగన్ ఆస్తి ఇచ్చినా షర్మిల కుట్ర రాజకీయం ఏమిటి?



మాట్లాడుతున్న రెడ్యం వెంకటసుబ్బారెడ్డి

చాపాడు : మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆస్తి ఇచ్చినా పీసీసీ అధ్యక్షురాలు షర్మిల చేస్తున్న కుట్ర రాజకీయం ఏమిటని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకులు, ఏపీఎస్ ఆర్టీసీ మాజీ జోనల్ చైర్మన్ రెడ్యం వెంకటసుబ్బారెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. చెల్లిపై ఎనలేని ప్రేమతో వైఎస్ జగన్ తన స్వార్జిత ఆస్తి రూ.200 కోట్లు షర్మిలమ్మకు ఇవ్వడంతోపాటు కోర్టు కేసులు పూర్తి అయ్యాక ఇంకొన్ని ఆస్తులు ఇస్తానని ఎంఓయూ రాసి ఇచ్చారని తెలిపారు. ఆమె ఎల్లో మీడియా, కూటమి నేతలతో కుమ్మక్కై తన అన్న జగన్‌పై, ఎంపీ అవినాష్‌రెడ్డిపై విష ప్రచారం చేస్తున్నారని విమర్శించారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడిపై దాడి




గాయపడిన వెంకట మహేశ్వర్‌రెడ్డి

సింహాద్రిపురం : మండలంలోని నంద్యాలం పల్లె గ్రామంలో శుక్రవారం రాత్రి వైఎస్సార్‌సీపీ నాయకుడు వై.వెంకట మహేశ్వర్‌రెడ్డిపై అదే గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు వై.అరుణ్‌రెడ్డి, ఇంద్రసేనారెడ్డి వాసుదేవారెడ్డి, చంద్రమల్లేశ్వర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి రాడ్లతో దాడి చేశారు. ఈ ఘటనలో ఆయన గాయపడ్డాడు. బాధితుడి కుటుంబ సభ్యులు సింహాద్రిపురం పోలీస్‌స్టేషన్ ఇంచార్జ్ ఎస్ఐ ఎస్ఎండీ షరీఫ్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం బాధితుడిని పులివెందుల ఆసుపత్రికి తరలించారు.

గతంలోనూ దాడి : వెంకట మహేశ్వర్‌రెడ్డి మండల వైఎస్సార్‌సీపీలో చురుకైన నాయకుడు. పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనడంతోపాటు మండలంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నాడు. ఇది ఓర్వలేకే స్థానిక టీడీపీ నాయకులు ఇతనిపై కక్ష కట్టారు. ఇందులో భాగంగానే దాడులకు దిగుతున్నారు. వెంకట మహేశ్వర్ రెడ్డిపై గతంలోనూ ఓ సారి దాడి చేశారు.

బుగ్గవంక డ్యామ్‌లో విద్యార్థి మృతి



ప్రేమ్‌కుమార్ మృతదేహం

చింతకొమ్మదిన్నె (వల్లూరు) : చింతకొమ్మదిన్నె మండలంలోని బుగ్గవంక డ్యాంను చూడడానికి వచ్చిన విద్యార్థి నీటిలో జారిపడి మృతి చెందినట్లు సికెదిన్నె సీఐ శివశంకర్ నాయక్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన తెలిపినన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. నగరంలోని పాత కడపకు చెందిన ప్రేమ్‌కుమార్ (17) శ్రీహరి డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్నాడు. మధ్యాహ్నం సరదాగా తన నలుగురు స్నేహితులతో కలిసి బుగ్గవంక డ్యాం చూడడానికి వచ్చాడు. ప్రమాదవశాత్తు డ్యాంలోకి జారిపడి కనిపించలేదు. అతని స్నేహితులు అందించిన సమాచారం మేరకు సీఐ గజ ఈతగాళ్ల సహాయంతో దగ్గరుండి సహాయక చర్యలు చేపట్టారు. ఎట్టకేలకు రాత్రి మృతదేహాన్ని వెలికి తీశారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్ మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రిమ్స్‌లో గుర్తుతెలియని మహిళ మృతదేహం



కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగర శివారులోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో గుర్తుతెలియని మహిళ ఈ నెల 16న అనారోగ్యంతో చేరింది. ఆమె వైద్య సేవలు పొందుతుండగా ఈ నెల 21న మృతి చెందింది. రికార్డుల ప్రకారం మృతురాలి పేరు మంజుల పద్మగా తెలిసింది. ఆమె ఆచూకీ తెలిసిన వారు తమ దృష్టికి తీసుకు రావాలని రిమ్స్ అధికారులు తెలియజేశారు.

గ్యాస్ సిలిండర్ లీక్

– వ్యక్తికి తీవ్ర గాయాలు

పెండ్లిమర్రి : ఓ ఇంట్లో గ్యాస్ సిలిండర్ లీకై మంటలు చేలరేగి ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలో శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. కొండూరు దళితవాడ గ్రామానికి చెందిన వేంపల్లె వరపుత్రుడు కూలీ పనులకు వెళ్లివచ్చి ఇంట్లో గ్యాస్ స్టౌపై నీళ్ల వేడి చేస్తుండగా.. పక్కన ఉన్న ఇంకొక సిలిండర్ నుంచి గ్యాస్ లీకై మంటలు వ్యాపించాయి. ఈ అగ్ని ప్రమాదంలో ఆయన తీవ్ర గాయాల పాలయ్యాడు. స్థానికులు గమనించి మంటలు ఆర్పివేసి చికిత్స నిమిత్తం నందిమండలం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు.

డ్రోన్‌తో ట్రాఫిక్ నియంత్రణ చర్యలు

కడప కోటిరెడ్డిసర్కిల్ : జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు ట్రాఫిక్ సీఐ డీకే జావీద్ డ్రోన్ సాయంతో ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టారు. ట్రాఫిక్ సిబ్బంది మూడు రోజుల నుంచి నగరంలోని ప్రధాన కూడళ్లలో డ్రోన్ కెమెరాల సాయంతో ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపడుతున్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఔషధ దుకాణాల తనిఖీ



తనిఖీలు నిర్వహిస్తున్న డ్రగ్ ఇన్‌స్పెక్టర్ మాధవి

కడప కోటిరెడ్డిసర్కిల్ : నగరంలోని పలు మెడికల్ షాపుల్లో కడప, రాయచోటి డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు జి.మాధవి, ఎస్.జయరాములు శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. మత్తు పదార్థాల అమ్మకాలపై పత్రికల్లో వచ్చిన వార్తలపై స్పందించి ఈ తనిఖీలు చేపట్టారని వారు తెలిపారు. మత్తు కలిగించే మందుల అమ్మకపు రికార్డులను పరిశీలించామన్నారు. నిబంధనలు ఉల్లంఘించి అమ్మకాలు చేపట్టిన రెండు షాపుల తనిఖీ నివేదికలను తగు చర్యల నిమిత్తం ఉన్నతాధికారులకు పంపామన్నారు. అలాగే నగరంలోని ఎస్ఎఫ్ఎస్ స్ట్రీట్‌లోని డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ అసిస్టెంట్ డైరెక్టర్ నాగ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో కూడా తనిఖీలు చేపట్టారు.

31 మద్యం బాటిళ్లు స్వాధీనం

వేముల : మండలంలోని చింతలజూటూరు గ్రామానికి చెందిన పెద్దిరెడ్డి రాజశేఖరరెడ్డి అనే వ్యక్తి అక్రమంగా మద్యం విక్రయిస్తుండగా పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి 31 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

ఆటోను ఢీకొన్న ఐచర్

వల్లూరు (చెన్నూరు) : చెన్నూరు మండలంలోని బుడ్డాయపల్లె క్రాస్ వద్ద శుక్రవారం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఆటోను ఐచర్ వాహనం ఢీకొనడంతో వల్లూరు మండలం మిట్టపల్లికి చెందిన నరసింహ అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడిని 108 వాహనంలో చికిత్స నిమిత్తం కడప రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ఇదిలా ఉండగా ప్రమాదానికి గురైన ఆటోలో మరో మహిళ ఉన్నట్లు సమాచారం. స్థానిక సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పురుషోత్తంరాజు ఐచర్ వాహనాన్ని, డ్రైవర్, క్లీనర్‌లను అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. చెన్నూరు పోలీసులు ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కారు ఢీకొని ఇద్దరు మృతి



మృతి చెందిన సిద్దారెడ్డి



షేక్ మన్సూర్ (ఫైల్)



రిమ్స్‌లో చిన్న సిద్దారెడ్డి మృతదేహాన్ని పరిశీలిస్తున్న వైఎస్ఆర్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి

కడప వైఎస్ఆర్ సర్కిల్/చింతకొమ్మదిన్నె : మోటారు బైకులను కారు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు మృతి చెందినట్లు చింతకొమ్మదిన్నె సీఐ శివశంకర్ నాయక్ తెలిపారు. శుక్రవారం ఆయన తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. చింతకొమ్మదిన్నె మండలం ఊటుకూరు గ్రామానికి చెందిన పొన్నోలు చిన్న సిద్దారెడ్డి(52) గురువారం సాయంత్రం మోటార్ బైక్‌పై కడపకు పని నిమిత్తం బయలుదేరాడు. ఊటుకూరు బ్రిడ్జి సమీపంలో వేణుగోపాల్ లాడ్జి, మినీ ఫంక్షన్ హాల్ దగ్గర రోడ్డు దాటుతున్నాడు. ఈ క్రమంలో కడప వైపు నుంచి కారును డ్రైవర్ వేగంగా నడుపుకొంటూ వచ్చి ముందు పోతున్న మోటార్ సైకిల్‌ను తగిలించుకుంటూ పోతూ చిన్న సిద్దారెడ్డి మోటార్ సైకిల్‌ను ఢీకొట్టాడు. చిన్న సిద్దారెడ్డి కొద్దిగా తన మోటార్ సైకిల్‌ను ముందుకు నడపగా.. అప్పుడు కారు ముందు వస్తున్న మోటార్ సైకిల్‌ను ఊటుకూరుకు చెందిన షేక్ మన్సూర్ అనే వ్యక్తి తన మోటార్ సైకిల్‌తో చిన్న సిద్దారెడ్డిని ఢీకొట్టడం జరిగింది. ఈ ప్రమాదంలో వీరిద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. వారిని చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. సిద్దారెడ్డిని మెరుగైన చికిత్స నిమిత్తం ప్రైవేట్ హాస్పిటల్‌లో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతున్నా పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. చిన్న సిద్దారెడ్డి మృతదేహాన్ని రిమ్స్‌లో వైఎస్ఆర్ సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి, ఊటుకూరు గ్రామంలో కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్యరెడ్డి సందర్శించి నివాళులు అర్పించారు. అదే విధంగా కడప రిమ్స్‌లో చికిత్స పొందుతున్న షేక్ మన్సూర్ మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పశువైద్య కళాశాల అభివృద్ధికి కృషి



అతిథులను మెమెంటోతో సత్కరిస్తున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు : పశువైద్య కళాశాల అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి తెలిపారు. పశువైద్య కళాశాలలో మూడు రోజుల పాటు జరిగిన జాతీయ సదస్సు ముగింపు సభ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తన కన్నబిడ్డ లాంటి ఈ కాలేజీలో ఇంత గొప్ప కార్యక్రమం నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. దేశ, విదేశాల నుంచి వచ్చిన శాస్త్రవేత్తలు తమ పరిశోధన పత్రాలు సమర్పించారన్నారు. ఈ కాలేజీ స్థాపనకు చేసిన కృషిని ఎమ్మెల్యే తెలుపుతూ భావోద్వేగానికి గురయ్యారు. మూగ జీవాల మీద ఉన్న ప్రేమతో ఈ కాలేజీని ఇక్కడ పెట్టడం జరిగిందన్నారు. ఈ కాలేజీ అభివృద్ధి ఏ సాయం కావాలన్నా చేస్తానని తెలిపారు. కాలేజీకి రోడ్డు మరమ్మతు పనులను త్వరలో చేపడుతామన్నారు. సీఎం దృష్టికి తీసుకెళ్లి కాలేజీలో ఆడిటోరియం నిర్మిస్తామని చెప్పారు. అనంతరం పశువులలో పునరుత్పత్తి సమస్యల నివారణ చర్యలు, సమీకృత దాణా తక్కువ ఖర్చుతో తయారీ అనే అంశాల్లో ఆదర్శ రైతుల సందేహాలకు శాస్త్రవేత్తలు సమాధానాలు చెప్పారు. ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ రాజకిశోర్ మాట్లాడుతూ మూడు రోజులుగా జరిగిన జాతీయ సదస్సుల్లో 8 టెక్నికల్ సెషన్స్ జరిగాయని, వాటిలో 16 లీడ్‌పేపర్స్‌ను ప్రజెంట్ చేశారన్నారు. 181 పరిశోధన పత్రాలను దేశ, విదేశాల శాస్త్రవేత్తలు ప్రజెంట్ చేశారని వివరించారు. శాస్త్రవేత్తలు తమ పరిశోధనా పత్రాలకు గాను ప్రథమ, ద్వితీయ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఎల్‌డీఏ సీఈఓ డాక్టర్ ఎం.శ్రీనివాసరావు, జేడీ డాక్టర్ శారదమ్మ, డాక్టర్ సీహెచ్ శ్రీలత, ఎస్వీఎస్ బీటీ ప్రెసిడెంట్ డాక్టర్ ధామి, కాలేజీ అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

భోజనం పెట్టలేదని నర్సింగ్ విద్యార్థుల ఆందోళన



బయటి నుంచి భోజనాలు తెచ్చుకుంటున్న విద్యార్థులు

జమ్మలమడుగు : జమ్మలమడుగు పట్టణం సీఎస్ఐ క్యాంబెల్ ఆసుపత్రి ఆవరణలోని నర్సింగ్ కాలేజీ విద్యార్థులు గురువారం రాత్రి యాజమాన్యం అన్నం పెట్టడం లేదంటూ నిరసన వ్యక్తం చేశారు. ఫీజులు కట్టలేని కారణంగా ఈ విధంగా చేశారని, ఆకలితో ఇబ్బంది పడుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తమ కుటుంబాలలో ప్రస్తుతం ఆర్థిక పరంగా ఇబ్బందులు ఉండటంతో.. కేవలం రెండు నెలలకు సంబంధించిన మెస్ ఫీజు చెల్లించలేదని, గతంలో సక్రమంగా చెల్లించడం జరిగిందని పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న విద్యార్థి సంఘం నాయకులు నర్సింగ్ కాలేజీ విద్యార్థులను పరామర్శించడంతో పాటు యాజమాన్యంతో చర్చించారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ నాయకుడు శివకుమార్ సీఎస్ఐ క్యాంబెల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ ఆగస్టిన్ రాజుతో చర్చించారు. ఇటువంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా చర్యలను తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇదిలా ఉండగా బయటి హోటళ్ల నుంచి భోజనం తెచ్చుకుని తినాల్సిన పరిస్థితి ఏర్పడిందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు.

విద్యార్థులను పరామర్శించిన ఆర్డీఓ

విషయం తెలుసుకున్న ఆర్డీఓ సాయిశ్రీ విద్యార్థులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాము విద్యార్థులతో మాట్లాడామని తెలిపారు. రెండు రోజుల నుంచి సరిగా భోజనం పెట్టడం లేదని వారు తెలిపారని చెప్పారు. ఫీజు చెల్లించనంత మాత్రాన భోజనం పెట్టకపోవడం సరైంది కాదన్నారు. దీనిపై ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు చర్యలను తీసుకుంటామని వివరించారు.

పెయ్య దూడల ఉత్పత్తి పెంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ సీఈఓ డాక్టర్ శ్రీనివాసరావు

కడప అగ్రికల్చర్ : జిల్లాలో పెయ్య దూడల ఉత్పత్తి పెంపుదలకు పశువైద్యులు కృషి చేయాలని రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డాక్టర్ శ్రీనివాసరావు పేర్కొన్నారు. శుక్రవారం ఊటూకూరు డీడీ కార్యాలయంలో జిల్లాలోని కడప, జమ్మలమడుగు, పులివెందుల డివిజన్ల పరిధిలోని డీడీలు, ఏడీలు, వీఏఎస్‌లకు పెయ్య దూడల పెంపకంపై సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెయ్య దూడల ఉత్పత్తికి సంబంధించిన సెక్స్ సార్టెడ్ సెమెన్‌పై రైతులకు అవగాహన పెంచాలన్నారు. పెయ్య దూడల ఉత్పత్తి పెరిగి, భవిష్యత్తులో పాడి పరిశ్రమ అభివృద్ధి చెందుతుందన్నారు. తద్వారా రైతులు ఆర్థికస్వాలంబనను సాధించడం వీలవుతుందన్నారు. సెక్స్ సార్టెడ్ సెమన్ వాడకం ద్వారా పశువుల్లో పెయ్య దూడల ఉత్పత్తి నిష్పత్తి గణనీయంగా పెరుగుతుందన్నారు. జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ శారదమ్మ మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న పశుగణన సందర్భంగా వైద్యులు, ఎన్యూమరేటర్స్ సెక్స్ సార్టెడ్ సెమన్ గురించి కూడా రైతులకు వివరించాలని తెలిపారు. ఈ సెక్స్ సార్టెడ్ సెమన్ వాడకంతో పెయ్య దూడల ఉత్పత్తి పెరుగుతుందని రైతులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డీడీపీ, ఏడీలు, వీఏఎస్‌లు పాల్గొన్నారు.